సాక్షి రంగారెడ్డి

బుధవారం । 22 । మార్చి । 2023



బీజేపీని గద్దె దించితేనే భవిష్యత్

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే ప్రజలకు భవిష్యత్ ఉంటుందని సీఐటీయూ, రైతు సంఘం నాయకులు అన్నారు. 8లో ▸

6,154 మంది గైర్హాజరు

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం గణితం, బాటనీ, పొలిటికల్ సైన్స్ పేపర్–2 పరీక్షల్లో 6,154 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 82,656 మందికి 3,411, రంగారెడ్డి జిల్లాలో 58,041 మందికి గాను 1,633, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 53,478కి గాను 1,110 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

రేపటి నుంచి 'ఏస్కీ'లో అంతర్జాతీయ సదస్సు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఏస్కీ)లో గురువారం నుంచి అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు తెలిపారు. మూడు రోజుల పాటు కొనసాగే సదస్సును తెలంగాణ రాష్ట్ర కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ భూముల పరిశీలన



రాజేంద్రనగర్‌లో భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ హరీశ్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ హరీశ్ అన్నారు. ప్రభుత్వం ఈ–వేలం వేయనున్న సరూర్‌నగర్, రాజేంద్రనగర్ డివిజన్లలోని బాలాపూర్, సరూర్‌నగర్, రాజేంద్రనగర్, గండిపేట్ మండలాల్లోని ప్రభుత్వ భూములను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ–వేలం వేసే భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, సరిహద్దులు సక్రమంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు చంద్రకళ, సూరజ్, తహసీల్దార్లు జయశ్రీ, రాజశేఖర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

లీకేజీలపై కఠిన చర్యలు

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్



నిరుద్యోగులకు పోటీ పరీక్షల మ్యాగజైన్‌ను అందజేస్తున్న శ్రీధర్ తదితరులు

బడంగ్‌పేట్: ప్రభుత్వ ఉద్యోగాల పేపర్ లీకేజీ ఘటనపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టిందని, ఇకనుంచి పకడ్బందీగా జరుగుతాయని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్ అన్నారు. బడంగ్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కిందిస్థాయి ఉద్యోగుల కారణంగా పేపర్ లీకేజీ ఘటనలు జరగడం బాధాకరమన్నారు. అభ్యర్థులు అపోహలు పెట్టుకోకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మనోజ్‌కుమార్, ప్రతాప్, గ్రంథపాలకులు సత్యనారాయణ, జైహింద్, విష్ణు, ప్రసన్న, రాజు, శరత్, పిలోత్రి తదితరులు పాల్గొన్నారు.

డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన



ఇబ్రహీంపట్నం రూరల్: డౌన్ సిండ్రోమ్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి మోతి అన్నారు. జాతీయ డౌన్ సిండ్రోమ్ డేను పురస్కరించుకొని జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రంలో వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మోతి మాట్లాడుతూ ఈ వ్యాధిగ్రస్తుల్లో క్రోమోజోమ్‌లు 21లో రెండు ఉండాల్సిన పోగులు మూడు ఉంటాయని, అందుకే దీనిని ట్రిసోమి 21గా పిలుస్తారన్నారు. పిల్లల మానసిక, భౌతిక వికాసం గురించి తల్లిదండ్రులు పట్టించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీదేవి, బీఎల్ఎస్ఏ రంగారెడ్డి, సీడీపీఓ వనిత, నోడల్ అధికారి రఘు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి



దండుమైలారంలో సంతకాలు సేకరిస్తున్న మత్స్యకార్మిక సంఘం నేతలు

ఇబ్రహీంపట్నం: మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చనమోని శంకర్ డిమాండ్ చేశారు. దండుమైలారంలో మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు రాజు అధ్యక్షతన మంగళవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని ఏప్రిల్ 3న ఢిల్లీలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 50 ఏళ్లు నిండిన మత్స్యకారులకు రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని, మత్స్యకారుడు చనిపోతే వారి కుటుంబానికి రూ.పది లక్షల పరిహారం ఇవ్వాలని, బడ్జెట్‌లో రూ.లక్ష కోట్లు కేటాయించాలని, చెరువులు, కుంటలు లూటీ జరగకుండా చట్టం తేవాలన్న డిమాండ్లతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బాలరాజ్, బుగ్గరాములు, శంకర్ పాల్గొన్నారు.



హుడాకాంప్లెక్స్: మామిడికాయలు, ఆకుల విక్రయం



హుడాకాంప్లెక్స్: మార్కెట్‌లో పువ్వుల కొనుగోలు

వేడుక వేళ

తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని బుధవారం ఘనంగా జరుపుకొనేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. శ్రీ శోభకృత్‌నామ సంవత్సర వేడుక కోసం ఆలయాలు ముస్తాబయ్యాయి. పంచాంగ శ్రవణాలను వినిపించేందుకు, ఉగాది పచ్చడిని భక్తులకు పంచేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పచ్చడికి అవసరమైన కొత్త కుండలు, మామిడి ఆకులు, వేపపువ్వు, మామిడి కాయలు, పూజా సామగ్రి కొనుగోళ్లతో మంగళవారం మార్కెట్లలో సందడి కనిపించింది. కాగా, జిల్లా ప్రజలకు మంత్రి సబితారెడ్డి, కలెక్టర్ హరీశ్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజలందరికీ శుభాలు జరగాలని ఆకాంక్షించారు. పండుగను ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు.



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ రైతుబజార్‌లో అమ్మకానికి సిద్ధంగా కుండలు

అడవిని సంరక్షించుకుందాం

అటవీ శాఖ చీఫ్ కన్సర్వేటర్ అధికారి సైదులు



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న అటవీ శాఖ అధికారి సైదులు

మొయినాబాద్: అడవిని సంరక్షించుకోవడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అటవీ శాఖ చీఫ్ కన్సర్వేటర్ అధికారి బి.సైదులు అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా చిలుకూరు రెవెన్యూలో ఉన్న మృగవని జాతీయ పార్కులో మంగళవారం వేడుకలు నిర్వహించారు. వన ప్రదర్శన కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రకృతిపై అవగాహన కల్పించారు. జీవ వైవిధ్యంపై షార్ట్‌ఫిలిం ప్రదర్శించారు. సఫారీ వాహనంలో ఎక్కించి మృగవని పార్కులోని జంతువులు, పక్షులు, ఔషధ మొక్కల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి మనుగడకు ఉపయోగపడే ప్రకృతిని కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం మృగవని పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ రాహుల్‌కిసాన్ జాదవ్, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ప్రతిమ, సెక్షన్ ఆఫీసర్ కమాలుద్దీన్ పాల్గొన్నారు.

సేఫ్టీ ఏదీ!



- మెజార్టీ ఆస్పత్రుల్లో కనిపించని ఫైర్‌సేఫ్టీ పరికరాలు
- తరచూ వెలుగు చూస్తున్న అగ్ని ప్రమాదాలు
- అయినా పట్టని అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మూడేళ్ల క్రితం ఎల్బీనగర్‌లోని షైన్ చిల్డ్రన్స్ ఆస్పత్రిలో షార్ట్ సర్క్యూట్ తలెత్తి ఇంకుబేటర్లలో చికిత్స పొందుతున్న నలుగురు చిన్నారులు మృతి చెందారు. ఏడాది క్రితం నిజాంపేట హోలిస్టిక్ ఆస్పత్రిలోనూ అగ్ని ప్రమాదం వెలుగు చూసింది. రూ.కోట్ల విలువ చేసే ఆస్తితో పాటు అమాయకులు మృత్యువాత పడుతున్నారు. అయినా సంబంధిత అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదు. భవన యజమానులు మేల్కొనడం లేదు. ఇటీవల జిల్లాలోని పలు ఆస్పత్రులపై వైద్య ఆరోగ్యశాఖ తనిఖీలు చేపట్టింది. మెజార్టీ ఆస్పత్రుల్లో ఫైర్‌సేఫ్టీ లేదని గుర్తించింది. ఈ మేరకు నోటీసులు కూడా జారీ చేసింది. అయినా ఇప్పటికీ ఆయా ఆస్పత్రుల్లో పరిస్థితి మెరుగుపడకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

800పైగా ఆస్పత్రుల్లో తనిఖీలు

జిల్లా వ్యాప్తంగా సుమారు 1,800 వరకు ఆస్పత్రులు, ఫస్ట్ ఎయిడ్ క్లినిక్స్, డయాగ్నోస్టిక్స్ ఉన్నట్లు అంచనా. వీటిలో ఇప్పటి వరకు 1,500 ఆస్పత్రులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి అనుమతులు పొందాయి. ఇటీవల జిల్లా వ్యాప్తంగా సుమారు 800పైగా ఆస్పత్రుల్లో తనిఖీ చేయగా, మెజార్టీ ఆస్పత్రుల్లో ఫైర్ ఎన్ఓసీ లేనట్లు గుర్తించారు. ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగితే నిప్పును ఆర్పేందుకు కనీస అగ్నిమాపక పరికరాలు లేవు. ఫైర్ సర్టిఫికెట్లు కూడా లేవు. ఏదైనా ఘటన జరిగినప్పుడు తనిఖీల పేరుతో వైద్య ఆరోగ్యశాఖ, ఫైర్, మున్సిపల్ శాఖల అధికారులు హడావుడి చేసి.. ఆ తర్వాత పూర్తిగా విస్మరిస్తున్నారు. ఫలితంగా వివిధ రుగ్మతులతో బాధపడుతూ ఆయా ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్న వారు అగ్నికి ఆహుతి అవుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

వెంటనే సీజ్ చేయాలి

ఏదైనా ఘటన వెలుగు చూసినప్పుడు హడావుడి చేయడం.. ఆ తర్వాత పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. వరుసగా చోటు చేసుకుంటున్న విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌లు.. అగ్ని ప్రమాదాలను చూసి కూడా అధికారుల్లో చలనం రాకపోవడం బాధాకరం. ఫైర్ ఎన్ఓసీలు లేకుండా ఇరుకైన భవనాల్లో ఆస్పత్రులు నిర్వహిస్తూ పేద, మధ్య తరగతి రోగుల జీవితాలతో ఆడుకుంటున్న ఆస్పత్రులను గుర్తించి, వెంటనే సీజ్ చేయాలి.

– జగన్, ప్రైవేటు ఆస్పత్రి బాధితుల సంఘం

నోటీసులిస్తున్నాం

యాభై పడకలలోపు ఉన్న మెజార్టీ ఆస్పత్రులు 15 మీటర్లలోపు భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వీటికి ఫైర్ ఎన్ఓసీలు అవసరం లేదు. ఫైర్‌సేఫ్టీ పరికరాలు మాత్రం విధిగా ఏర్పాటు చేయాలి. 16 మీటర్ల కంటే ఎత్తైన భవనాలకు మాత్రం ఫైర్ ఎన్ఓసీ తప్పనిసరి చేశాం. ఇప్పటికే పలు ఆస్పత్రులు, సెల్లార్లలో డయాగ్నోస్టిక్స్ నిర్వహిస్తున్న వాటికి కూడా నోటీసులిచ్చాం. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఆస్పత్రులను సీజ్ చేయడానికి వెనుకాడేది లేదు.

– డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, డీఎంహెచ్ఓ

పార్టీ పటిష్టతకు ఆత్మీయ సమ్మేళనాలు



మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి, హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు

మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: బీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు ఆత్మీయ సమ్మేళనాలు దోహదం చేస్తాయని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లతో మంగళవారం మీర్‌పేటలోని ఎస్వైఆర్ గార్డెన్స్‌లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో పార్టీ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఒక్కతాటిపైకి వచ్చి పార్టీ పటిష్టతకు పాటుపడాలన్నారు. ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దేశానికే ఆదర్శంగా నిలిచిందని, దేశ ప్రజలంతా తెలంగాణ మోడల్ పరిపాలనను కోరుకుంటున్నారని అన్నారు. ప్రతి కుటుంబానికి కనీసం ఒక పథకంతో లబ్ధి చేకూర్చామని, ప్రభుత్వం చేసిన మంచి పనులు, అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ తీసుకెళ్లి విస్తృతంగా వివరిద్దామన్నారు. ఆ దిశగా 'అబ్‌కీ బార్ కిసాన్ సర్కార్' నినాదంతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ప్రతిపక్షాల విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలంగా ఉందని, మంత్రి సబితారెడ్డి, ప్రజాప్రతినిధులతో కలిసి ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, మూసీ రివర్‌బోర్డు చైర్మన్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, సురభి వాణీదేవి, దయానంద్, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, అంజయ్య యాదవ్, జైపాల్‌యాదవ్, కార్పొరేషన్ల చైర్మన్లు ఆయాచితం శ్రీధర్, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, లక్ష్మీనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు మనోహర్‌రెడ్డి, కృపాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నం, కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

'పురానాపూల్' నయాగా!

అభివృద్ధి చేయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: నగర కమిషనరేట్‌లోని ఎంట్రీ పాయింట్‌గా ఉన్న పురానాపూల్ జంక్షన్‌పై సిటీ ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్‌బాబు ప్రత్యేక దృష్టి పెట్టారు. సాధారణ వాహన చోదకులతో పాటు హైకోర్టు న్యాయమూర్తులు సైతం ప్రయాణించే ఈ మార్గం ఇరుకుగా ఉండటంతో రద్దీ వేళల్లో అనేక ఇబ్బందులు వస్తున్నాయి. దీన్ని అధ్యయనం చేసిన ట్రాఫిక్ విభాగం అధికారులు పలు కీలక మార్పుచేర్పులు చేసి విస్తరిస్తున్నారు. అక్కడి పాత వంతెనపై ఉన్న మండీని సమీపంలోని మరో ప్రాంతానికి తరలిస్తేనే పూర్తి ఫలితాలు వచ్చే ఆస్కారం ఉంది.

జూపార్క్ ఫ్లైఓవర్ ప్రారంభంతో..

నగరంలో ఉన్న ఐదు రోడ్ల కూడళ్లలో పురానాపూల్ జంక్షన్ ఒకటి. ఆరాంఘర్ వైపు నుంచి సిటీలోకి వచ్చే వాహనాలు, ఇక్కడ నుంచి బయటకు వెళ్లే వాటితో పాటు జియాగూడ, కార్వాన్, ఇసామియా బజార్ వైపు వెళ్లే వాహనాలు దీని మీదుగానే ప్రయాణిస్తాయి. ఇది హైకోర్టుకు సమీపంలో ఉండటంతో సాధారణ వాహన చోదకులతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో న్యాయమూర్తులు ప్రయాణిస్తుంటారు. కొన్నాళ్ల క్రితం వరకు ఇబ్బందులు ఎక్కువగా లేకపోయినా.. జూపార్క్ వద్ద నిర్మించిన ఫ్లైఓవర్ నిర్మాణంతో ఇవి వచ్చిపడ్డాయి. ఈ వంతెన కారణంగా సిగ్నల్ లేకుండా వాహనాలు దూసుకువస్తుండటంతో ఈ జంక్షన్ జాం అవుతోంది.

సమన్వయమే పెద్ద సవాల్

అత్యంత కీలకమైన జంక్షన్లలో ఒకటైన పురానాపూల్ ప్రాంతం భౌగోళికంగా వివిధ జోన్లలో విస్తరించి ఉంటుంది. జీహెచ్ఎంసీ విషయానికి వస్తే ఇద్దరు జోనల్ కమిషనర్లు, ముగ్గురు డిప్యూటీ కమిషనర్లతో పాటు కార్వాన్, గోషామహల్ ఎమ్మెల్యేల పర్యవేక్షణలో ఉండే ప్రాంతం. సమన్వయ లేమితో చాన్నాళ్లుగా ఈ జంక్షన్ సమస్యలు కొలిక్కి రావట్లేదు. పరిష్కరించడానికి రంగంలోకి దిగిన ట్రాఫిక్ పోలీసులు ఆ ప్రాంతంలో సమగ్ర అధ్యయనం నిర్వహించారు. మూసీపై ఉన్న వంతెనకు కార్వాన్–జియాగూడ మార్గం వైపు కొన్ని మార్పులు చేయడం ద్వారా వాహనచోదకులకు ఉపయుక్తంగా మార్చవచ్చని గుర్తించారు.

రోడ్డును మింగే అడ్డంకులను తొలగించి..

ఈ ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా ఉండే అనేక అడ్డంకులను గుర్తించారు. వీటిని తొలగించడంతో రోడ్డు విశాలంగా మారడంతో పాటు ఫ్రీ లెఫ్ట్‌కు ఉపయుక్త మని తేల్చారు. స్థానిక అధికారులు, నాయకులను సంప్రదించడం ద్వారా ఈ పనులు పూర్తి చేశారు. జలమండలి అధికారులు నీటి సరఫరా పైపులు ఉండే ప్రాంతానికి మరమ్మతులు పూర్తి చేశారు. దీంతో చిన్న చిన్న ర్యాంపులు, కొద్దిపాటి రోడ్డు నిర్మాణంతో ఈ జంక్షన్ విశాలంగా మారనుంది.

పాత వంతెనపై మండీ ఉండటంతో..

పురానాపూల్ ప్రాంతంలో మూసీపై పాత వంతెన సింగిల్ రోడ్ బ్రిడ్జిగా, ఆ తర్వాత నిర్మించింది డబుల్ రోడ్ బ్రిడ్జిగా ఉన్నాయి. ప్రస్తుతం డబుల్ రోడ్ బ్రిడ్జి రాకపోకలకు ఉపయోగపడుతోంది. సింగిల్ రోడ్ బ్రిడ్జిపై ఏళ్లుగా కూరగాయల మండీ కొనసాగుతోంది. దీంతో ఈ వంతెన పూర్తి స్థాయిలో వాహనచోదకులకు ఉపయోగపడట్లేదు. ఈ వంతెనకు జియాగూడ మార్గంలో మూసీ వెంబడి 100 అడుగుల రోడ్డు అభివృద్ధి చేశారు. మండీని ఈ మార్గంలోకి మార్చి, పాత వంతెనను ఉపయోగంలోకి తీసుకువస్తే వాహనచోదకులకు మరింత ఉపయుక్తంగా ఉంటుందనే వాదన ఉంది. ఈ అంశంపై స్థానిక వ్యాపారులతో సంప్రదింపులు జరిపి, వారి అభిప్రాయం ఆధారంగా ముందుకు వెళ్లాలని ట్రాఫిక్ విభాగం అధికారులు నిర్ణయించారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్ రావు

శంకర్‌పల్లి: ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యాలు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు హెచ్చరించారు. పట్టణ కేంద్రంలోని మెగా ఆస్పత్రిని మంగళవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రోగుల వార్డులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంకర్‌పల్లిలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో నిబంధనలు పాటించడంలేదనే ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొన్నారు. పేద ప్రజల నుంచి ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. అనుమతి లేకుండా మెగా ఆస్పత్రిలో అబార్షన్ చేశారని ఓ మహిళ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిందని, కలెక్టర్ ఆదేశాల మేరకు ఆస్పత్రిని తనిఖీ చేసినట్టు తెలిపారు. తమ ఆస్పత్రిలో ఏ మహిళకూ అబార్షన్ చేయలేదని యాజమాన్యం వివరణ ఇవ్వగా, పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు డీఎంహెచ్ఓ పేర్కొన్నారు. అంతకు ముందు శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆయన వైద్య సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సాధారణ ప్రసవాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్, శంకర్‌పల్లి ఆస్పత్రి డాక్టర్ రేవతిరెడ్డి ఉన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

శభాష్ పోలీస్

16 మంది విద్యార్థులను కాపాడిన ఎస్ఐ

బంజారాహిల్స్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో ప్రగతి భవన్ ముట్టడికి యత్నించిన ఏబీవీపీ విద్యార్థులను అరెస్ట్ చేసి తీసుకెళ్లే క్రమంలో వ్యాన్ డ్రైవర్ హోంగార్డుకు మూర్ఛ రావడంతో ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌పై ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో సమయస్ఫూర్తితో వ్యవహరించిన బంజారాహిల్స్ ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి 16 మంది విద్యార్థులకు ముప్పు తప్పించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మంగళవారం మధ్యాహ్నం ఏబీవీపీ కార్యకర్తలు ప్రగతి భవన్‌కు వచ్చారు. అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసులు వీరిని అరెస్ట్ చేసి డీసీఎంలోకి ఎక్కించి బందోబస్తులో బంజారాహిల్స్ ఎస్ఐ కరుణాకర్‌రెడ్డిని పంపించారు. డీసీఎం డ్రైవర్ రమేష్ ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌పై నుంచి వెళ్తుండగా ఫిట్స్ రావడంతో స్టీరింగ్ వదిలేశాడు. దీంతో వ్యాన్ డివైడర్‌ను ఢీకొడుతూ వెళ్లింది. వీరందరిని తీసుకొని వెళ్తున్న కరుణాకర్‌రెడ్డి వెంటనే డ్రైవర్ సీటులోకి వెళ్లి రమేష్‌ను పక్కకు జరిపి వ్యాన్‌ను ఫుట్‌పాత్‌కు ఢీకొట్టేలా చేశాడు. దీంతో భారీ ప్రమాదం తప్పింది. హోంగార్డు రమేష్‌ను ఆస్పత్రికి తరలించారు. వ్యాన్‌ను పక్కకు జరిపే క్రమంలో ఎస్ఐ కరుణాకర్‌రెడ్డికి, మరో కానిస్టేబుల్ సాయికుమార్‌కు గాయాలయ్యాయి. వీరిద్దరిని కూడా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వ్యాన్ నడుపుతుండగా హోంగార్డు రమేష్‌కు ఫిట్స్ రావడం, వ్యాన్ డివైడర్‌కు, ఫుట్‌పాత్‌ను ఢీకొట్టుకుంటూ కొద్ది దూరం వెళ్లడం, ఈ క్రమంలో ఎస్ఐ వాహనాన్ని కంట్రోల్ చేయడం అంతా క్షణాల్లో జరిగిపోయాయి.

బీజేపీని గద్దె దించితేనే భవిష్యత్

- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి
- ఏప్రిల్ 5న ఢిల్లీలో ఐక్యతా ర్యాలీ



మాట్లాడుతున్న జంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: కులాలు, మతాల పేరుతో విభజన సృష్టిస్తున్న ప్రధాని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే ప్రజలకు భవిష్యత్ ఉంటుందనిడ సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన జీవుజాత ప్రచార యాత్ర మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ.. ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మతోన్మాద బీజేపీ పాలనను అంతమొందించాలన్నారు. కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీలను ప్రమాదంలో పడేసే విధానాలపై, నిర్ణయాలపై ప్రజా సంఘాలు సమర శంఖం పూరించాయన్నారు. ఏప్రిల్ 5న సుమారు 5లక్షల మందితో నిర్వహించే ఐక్యతా ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెట్రో, డీజిల్, వంట గ్యాస్ సిలిండర్‌లతోపాటు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచి పేదోడి నడ్డి విరుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు మధుసూదన్‌రెడ్డి, రాంచందర్, జగన్, రాజు, చంద్రమోహన్, కవిత, ముసలయ్య, రామకృష్టారెడ్డి, సామేల్, జంగయ్య, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

కాడెడ్లు @ రూ.2లక్షలు

ఆకాశన్నంటుతున్న పశువుల ధరలు



రూ.2లక్షలు పలికిన కాడెద్దులు

యాచారం: మాల్ పశువుల సంతలో మంగళవారం కాడెద్దుల ధరలు భగ్గుమన్నాయి. ఒక్కొక్క కాడెద్దుల జతకు రూ.2లక్షలకు పైగానే ధరలు పలికాయి. ఎద్దుల జతకు రూ.1.50లక్షలు, ఆవుల జతకు రూ.లక్షకు పైగానే ఉన్నాయి. వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే జూన్‌లో ధరలు ఎక్కువగా ఉంటాయి. వేసవిలోనే ఇలా ఉంటే సీజన్‌లో ఎలా ఉంటాయోనని రైతులు ఆందోలన వ్యక్తం చేస్తున్నారు. డీజిల్ ధర పెరగడం, యంత్రాల రేట్లు పెరగడంతో రైతులు మళ్లీ కాడెద్దులతో వ్యవసాయ పనులు చేసుకునేందుకే ఆసక్తి చూపుతున్నారు. దీంతో కాడెద్దుల ధరలకు రెక్కాలొచ్చాయని రైతులు చర్చించుకున్నారు.

బాలిక అదృశ్యం



ఫర్హానా బేగం(ఫైల్)

పహాడీషరీఫ్: బాలిక అదృశ్యమైన సంఘటన పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై డి.శ్రీను తెలిపిన ప్రకారం.. పహాడీషరీఫ్ గ్రామానికి చెందిన మహ్మద్ ఫజల్ కుమార్తె ఫర్హానా బేగం(16) ఈ నెల 20న ఉదయం 7గంటలకు ఇంట్లోని కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో బయటి నుంచి గడియపెట్టి వెళ్లిపోయింది. ఎంతకి రాకపోవడంతో స్థానికంగా వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. ముజ్జు అనే యువకుడిపై అనుమానం ఉందంటూ ఫర్హానాబేగం సోదరీ మేరాజ్ ఫాతిమా మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు జైలు



శ్రీనివాస్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు ఐదేళ్ల జైలు శిక్ష విధించినట్లు ఆదిబట్ల సీఐ రవి కుమార్ తెలిపారు. ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంగరకలాన్‌కు చెందిన ఉడుగుల అరుణ, శ్రీనివాస్‌కు 2001లో వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు సంతానం. శ్రీనివాస్ అదనపు కట్నం కోసం భార్య అరుణను వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన అరుణ 2016 డిసెంబర్ 28న ఒంటిపై కిరోసిన్ పోసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పూర్తి ఆధారాలను సేకరించిన పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. రంగారెడ్డి జిల్లా కోర్టులో ఐదేళ్లుగా కేసు పూర్వపరాలను పరిశీలించిన అనంతరం నిందితుడు శ్రీనివాస్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.4వేలు జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెల్లడించినట్లు సీఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు సీజ్ చేసిన వాహనం, రేషన్ బియ్యం

కడ్తాల్: అనుమతులు లేకుండా ఓ ఫౌల్ట్రీ ఫామ్‌లో అక్రమంగా విక్రయిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ ప్రసాద్‌జీ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఎక్వాయిపల్లి గ్రామానికి చెందిన ఏదుల మల్లేశ్, ఏదుల పరమేశ్ ఎక్వాయిపల్లి గ్రామంతో పాటు సమీప గ్రామాల్లోని ప్రజల వద్ద, సుమారు 23 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశారు. మండల కేంద్రానికి సమీపంలో ఉన్న గంగాధర్ ఫౌల్ట్రీ ఫామ్‌లో విక్రయిస్తుండగా విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాన్ని, బియ్యాన్ని సీజ్ చేశారు. ఏదుల మల్లేశ్, పరమేశ్, పౌల్ట్రీఫామ్ యజమాని దిలీప్‌కుమార్, సూపర్‌వైజర్ అఖిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో ఆవు మృతి



ఆవు కళేబరం

తలకొండపల్లి: కుక్కలు దాడి చేసి ఓ ఆవును చంపేశాయి. ఈ సంఘటన మండల పరిధిలోని కోరింతకుంట తండాలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. తండాకు చెందిన ముడావత్ మల్లేశ్ తన వ్యవసాయ పొలంలోని పశువుల షెడ్‌లో రెండు ఆవులను ఉంచాడు. కుక్కలు ఆ ఆవులపై దాడి చేయడంతో ఓ ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఆవుకు స్వల్ప గాయాలయ్యాయి. మృతి చెందిన ఆవు విలువ సుమారుగా రూ.లక్ష ఉంటుందని.. జీవనోపాధికి అప్పు చేసి ఆవు కొనుగోలు చేసానని.. ఇప్పుడు అప్పు ఎలా తీర్చాలని బాధితుడు విలపించాడు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నాడు.

దాడి కేసులో తండ్రి, కొడుకు రిమాండ్

రాజేంద్రనగర్: భార్యను వేధిస్తున్నాడని కుమారుడితో కలిసి యువకుడిపై దాడి చేసిన తండ్రి, కొడుకులను అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. లంగర్‌హౌజ్‌కు చెందిన నరహరిచారి(46), హరిప్రసాద్‌చారి(21) తండ్రీకొడుకులు. నరహరిచారి మొదటి భార్య మృతి చెందడంతో కోస్గికి చెందిన యువతిని రెండో వివాహం చేసుకున్నాడు. కోస్గికి చెందిన రవి నరహరిచారి తరచూ తన భార్యతో ఫోన్‌లో మాట్లాడేవాడు. నరహరిచారి లేని సమయంలో ఇంటికి వచ్చి వెళ్లే వాడు. సోమవారం సాయంత్రం అతను నరహరిచారి ఇంటికి వచ్చి తిరిగి వెళ్తుండగా నరహరిచారి, అతడి కుమారుడు హరిప్రసాద్‌చారి అతడిని వెంబడించి దాడి చేశారు. బాధితుడు రవి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

హెచ్‌ఎండీఏ భూముల్లో అక్రమార్కుల పాగా

- 1990 నుంచి 2011 వరకు రైతులకు పరిహారం చెల్లించి భూమిని సేకరించిన హెచ్‌ఎండీఏ
- ఖాళీ స్థలాల్లో పెద్ద నిర్మాణం
- సర్వేకు వచ్చిన అధికారులపై రాళ్లదాడి



శంషాబాద్: వందల కోట్ల రూపాయల విలువ చేసే హెచ్‌ఎండీఏ భూములపై అక్రమార్కుల కన్నుపడింది. గత కొంత కాలంగా కొందరు వ్యక్తులు ఆయా స్థలాలు తమకు చెందినవిగా పేర్కొంటూ అక్రమ నిర్మాణాలు చేపట్టారు. స్థానికుల ఫిర్యాదుతో అప్రమత్తమైన హెచ్‌ఎండీఏ అధికారులు పరిరక్షణ చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే..పట్టణంలోని సర్వే నంబరు 720 నుంచి 730 వరకు ఉన్న వివిధ సర్వే నంబర్లలో హెచ్‌ఎండీఏ 183 ఎకరాల భూమిని 1990లో రైతుల నుంచి సేకరించింది. 2011లో పలు దఫాలుగా వారికి పూర్తి పరిహారం సైతం చెల్లించి స్వాధీనం చేసుకుంది. సదరు స్థలాల్లో హెచ్‌ఎండీఏ నర్సరీలు, పార్కు స్థలాలు పోగా కొన్ని చోట్ల ఖాళీ స్థలాలున్నాయి. ఆయా స్థలాలను గతంలో ప్రభుత్వం ట్రక్ పార్కుకు కేటాయించినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం కొన్ని రూ. వందల కోట్ల విలువైన ఈ స్థలాలకు వారసులమంటూ కొందరు వ్యక్తులు ఆక్రమణలు చేపట్టారు. అంతేగాక అక్రమంగా ప్రహరీల నిర్మాణం చేపట్టడమేగాక, కొన్ని ప్రాంతాల్లో ఏకంగా గదులను నిర్మించి, వాచ్‌మెన్‌లను కాపలాగా పెట్టారు. గతంలో స్థలాలను అప్పగించిన రైతులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

అధికారులపై రాళ్ల దాడి..

హెచ్‌ఎండీఏ తమ స్థలాలను పరిరక్షించుకునే చర్యల్లో భాగంగా వారం రోజుల క్రితం ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులను కాపాలాగా ఉంచింది. తాజాగా స్థలాలను సర్వే చేయడంతో పాటు, అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు వచ్చిన అధికారులు, సిబ్బందిపై అక్రమార్కులు రాళ్లతో దాడి చేశారు. హెచ్‌ఎండీఏ అధికారులు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అక్రమ నిర్మాణాలు.. ఇంటి నంబర్లు..

హెచ్‌ఎండీఏ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన ఇళ్లకు మున్సిపాలిటీ అధికారులు ఇంటినెంబర్లు సైతం ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఇంటి నంబర్ల ఆధారంగా అక్రమార్కులు జనవరి, ఫిబ్రవరి మాసాల్లో మొత్తం 10కి పైగా స్థలాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి శారు. ఈ విషయం కూడా ప్రస్తుతం వెలుగులోకి రావడంతో అధికారులు మున్సిపాలిటీ అధికారులతో పాటు రిజిస్ట్రేషన్ అధికారుల నుంచి వివరాలు సేకరించే పనిలో పడ్డారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

చేవెళ్ల పార్లమెంట్ బూత్ సశక్తీకరణ అభియాన్ ఇన్‌చార్జి అరుణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

రాజేంద్రనగర్: భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని చేవెళ్ల పార్లమెంట్ బూత్ సశక్తీకరణ అభియాన్ ఇన్‌చార్జి అరుణ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ అసెంబ్లీ బూత్ సశక్తీకరణ అభియాన్ ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. మహవీర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్‌యాదవ్, జాయింట్ కన్వీనర్ మహాలింగం గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన అరుణ్‌కుమార్, అంజన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ బూత్ సశక్తీకరణ అభియాన్ ఇన్‌చార్జిలు పార్టీని మరింత ముందుకు తీసుకువెళ్లాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడమే కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలన్నారు. పార్టీ బూత్‌స్థాయి నుంచి బలోపేతమైనప్పుడే పటిష్టంగా ఉంటుందన్నారు. అందకు అందరిరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్‌రెడ్డి, భూపాల్‌గౌడ్, ప్రశాంత్‌నాయక్, లక్ష్మీనారాయణ, శ్రీధర్, బాల్‌రెడ్డి, శ్రీధర్, మైబు, సాబాద విజయ్‌కుమార్, అడికే జనార్దన్, మహేష్‌యాదవ్, భిక్షపతియాదవ్, బీరప్ప, వెంకటేష్, సాయియాదవ్, సందీప్ పాల్గొన్నారు.

కిందపడి యువకుడి మృతి



సచిన్ మృతదేహం

రాజేంద్రనగర్: ప్రమాదవశాత్తు కిందపడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. బుద్వేల్ ప్రాంతానికి చెందిన సచిన్(25) చిత్తుకాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం అతను కాటేదాన్ రామ్‌చరణ్ ఆయిల్‌మిల్ ప్రాంతంలోని ఫుట్‌పాత్‌పై కాగితాలు ఎరుకుంటూ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయమవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీసీలు సంఘటితం కావాలి



సమావేశానికి హాజరైన బీసీ జర్నలిస్టులు

శంషాబాద్: బీసీలు సంఘటిత శక్తిగా ఎదగాలని బీసీ జర్నలిస్టు సమాజ్ నేలు అన్నారు. బీసీలు, ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారత సాధించే దిశగా బీసీ జర్నలిస్టులు వారిని చైతన్యం చేయాలన్నారు. ఏప్రిల్ 8 నగరంలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించనున్న బీసీ జర్నలిస్టు మహాసభ సన్నాహక సమావేశాన్ని మంగళవారం స్థానిక శ్రీనిక హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు మ్యాడం మధు, సతీష్‌కమాల్, శేఖర్ సాగర్, నాగ పరిమళ మాట్లాడుతూ సంఖ్యాబలం ఉన్నప్పటికీ బీసీలు గ్రామ స్థాయి నుంచి చట్టసభల వరకు కూడా వెళ్లడం లేదన్నారు. ఇందుకు కారణాలను అన్వేషించడంలో జర్నలిస్టులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. రాజకీయ పార్టీలకు ఓటు బ్యాంకుగా మాత్రమే కాకుండా రాజ్యాంగబద్ధంగా బీసీలకు దక్కాల్సిన వాటాలపై కూడా సంస్కరణలు తీసుకొచ్చేలా పోరాడాల్సిన అవసరముందన్నారు. ఏప్రిల్ 8న నిర్వహించనున్న మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టులు బి.మనోహర్, డి.కృష్ణ, డి. రాజు, ఎం. ప్రేమ్‌రాజ్, బాబురావు, చంద్రకాంత్, ఏపీ చారి, సుదర్శన్‌గౌడ్, సూర్యకిరణ్, రాములుగౌడ్, తిరుమలేష్, విజయ్ కుమార్, లక్ష్మణ్, నరేందర్, గోపాల్, మాధవచారి, చంద్రశేఖర్, అనిల్, శ్రీకాంత్, నగేష్,శివకుమార్, యాదగిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నీటి విలువపై అవగాహన కార్యక్రమాలు



వాహనాలను ప్రారంభిస్తున్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకొని ప్రజలకు నీటి విలువతో పాటు అవగాహన కల్పించేందుకు జలమండలి పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. నీటి వృథాను అరికట్టడంపై పది రోజుల పాటు అవగాహన కల్పించేందుకు ఎన్జీవోలను సైతం భాగస్వాములు చేస్తోంది. నగర వ్యాప్తంగా ప్రచారం చేసేందుకు రెండు వాహనాలు సైతం ఏర్పాటు చేసింది. ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వీటికి సంబంధించిన కరపత్రాలు బోర్డు డైరెక్టర్లతో కలిసి ఎండీ దానకిషోర్ ఆవిష్కరించగా, ప్రచార వాహనాలను ఈడీ సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు.

మాకు న్యాయం చేయండి

నాగోలు: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన బీటెక్ విద్యార్థి నవీన్ హత్య వెనుక హరిహర కృష్ణ స్నేహితురాలు నిహారిక కుటుంబ సభ్యుల హస్తం ఉందని, ఈ విషయంలో మరింత లోతుగా దర్యాప్తు చేయాలని నవీన్ కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండ్ చేశారు. ఈమేరకు తమకు న్యాయం జరగడం లేదంటూ నవీన్ తండ్రి శంకరయ్య, తల్లి బుజ్జి, మామ శ్రీను ఇతర గిరిజన సంఘాల నాయకులు మంగళవారం ఎల్‌బీనగర్ డీసీపీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవీన్ హత్య కేసులో నిందితురాలిగా ఉన్న నిహారికకు ఇంత త్వరగా బెయిల్ ఎలా వచ్చింది..? నేరానికి పాల్పడినా బెయిల్ మంజూరు చేయడం ఆశ్చర్యంగా ఉందని వారు పేర్కొన్నారు. నెల రోజుల్లో చార్జిషీటు దాఖలు చేస్తామని చెప్పినా..ఇంతవరకు ఎలాంటి చర్యలు లేవన్నారు. నిహారికను అరెస్టు చేయాలని, హరిహర కృష్ణను వెంటనే ఉరితీసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇంత దారుణ హత్య కేసులో నిహారికకు బెయిల్ రావడం ఏంటని అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ హత్య వెనుక నిహారిక తండ్రి, అతని బావ ఉన్నాడని, వారిని కూడా వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లంబాడీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు శంకర్ నాయక్ మాట్లాడుతూ నవీన్ కుటుంబానికి న్యాయం జరగకపోతే రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా డీసీపీ కార్యాలయం వద్ద నవీన్ తల్లి బుజ్జి, ఇతర కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

చార్‌ధామ్ యాత్ర పేరిట సైబర్ వల

నకిలీ వెబ్‌సైట్ సృష్టించిన నేరస్తులు

- పది రోజుల టూర్ ప్యాకేజీ పేరిట చీటింగ్
- పూజారితో సహా యాత్రికులకు రూ.8 లక్షల కుచ్చుటోపీ

సాక్షి, సిటీబ్యూరో: పూజారితో సహా 27 మంది చార్‌ధామ్ యాత్రికులు సైబర్ వలలో చిక్కుకున్నారు. నకిలీ వెబ్‌సైట్ సృష్టించి..10 రోజుల పాటు యాత్రకు తీసుకెళ్తామని నమ్మించి రూ.8 లక్షలు కొట్టేశారు సైబర్ నేరస్తులు. అదనపు సొమ్ము ఇవ్వాలని డిమాండ్ చేయడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు రాచకొండ సైబర్ క్రైమ్స్‌లో ఫిర్యాదు చేశారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి.

- ఎల్బీనగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం పూజారి పి.శివశంకర్ శాస్త్రి గత నెలలో చార్‌ధామ్ యాత్రకు వెళ్లేందుకు అవసరమైన టూర్ ప్యాకేజీ కోసం గూగుల్‌లో శోధించాడు. దీంతో అతనికి ఓ వెబ్ లింక్ కనిపించింది. అది సైబర్ నేరస్తులు సృష్టించిన నకిలీ లింక్. బాధితుడు విషయం తెలియక..దాన్ని క్లిక్ చేసి అడిగిన వివరాలన్నీ నమోదు చేశాడు. ఆ తర్వాత కొద్ది సేపటికి టూర్ ఆర్గనైజర్ నుంచి అతనికి ఫోన్ వచ్చింది.
- ఆర్గనైజర్ల లాగా శివశంకర్‌ను నమ్మించిన నేరస్తులు..యాత్రకు వెళ్లే 27 మంది వివరాలను సేకరించారు. 10 రోజుల ప్యాకేజీ ఉంటుందని నమ్మించి, ఒక్కొక్కరికి రూ.18 వేలు ఖర్చవుతుందని తెలిపారు. టూర్‌లో భాగంగా స్థానికంగా ఏసీ బస్సు ఉంటుందని, బ్రేక్‌ఫాస్ట్, రాత్రి భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తామని వివరించారు. విమాన టికెట్లకు అదనపు వ్యయం అవుతుందని తెలిపారు. టూర్ ప్యాకేజీ సొమ్మును డిపాజిట్ చేయాలని బ్యాంకు ఖాతా నంబర్లను సూచించారు. దీంతో శివశంకర్ మిగిలిన యాత్రికుల నుంచి కూడా సొమ్ము వసూలు చేసి.. నేరస్తులు సూచించిన బ్యాంకు ఖాతా, పలు యూపీఐ అకౌంట్లలో రూ.7.92 లక్షలు జమ చేశాడు.
- మరుసటి రోజు మరోసారి ఫోన్ చేసిన నేరస్తులు.. చెల్లించిన సొమ్ము సరిపోదని, అదనంగా ఒక్కో యాత్రికుడు రూ.15 వేలు చొప్పున మొత్తం రూ.4.05 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో అనుమానం వచ్చి..మిగిలిన యాత్రికులకు ఈ విషయం వివరించగా.. వెంటనే వారు చెల్లించిన సొమ్మును తిరిగి ఇచ్చేయాలని కోరారు. ఇదే విషయాన్ని నేరస్తులకు తెలిపేందుకు పూజారి శివశంకర్ ప్రయత్నించగా.. వారు ఫోన్లను స్విచాఫ్ చేసేశారు. దీంతో రాచకొండ సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేశారు. ఐపీసీ 406, 419, 420, ఐటీ యాక్ట్ సెక్షన్ 66 కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.